


మెరుగైన పునరావాసం
మంగంపేటలోని కాలుష్య గ్రామాలకు మెరుగైన పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. రూ.40కోట్లతో తొలివిడత మౌలిక నదుపాయాలు కల్పించారు. -8లో



పర్యాటకం పరుగులు
ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో పర్యాటక శాఖ ఆదాయం పరుగులు పెడుతోంది. ఆదాయాన్ని పెంచుకునేందుకు అధికారుల చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. -8లో

గరిష్టం/కనిష్టం
29.4/18.9

వాతావరణం
జిల్లాలో సోమవారం 18.9 - 29.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

- సెంచురీ ప్యానల్స్ లిమిటెడ్ ప్రారంభంతో యువతకు ఉపాధి
- రిమ్స్‌లో సూపర్ స్పెషల్‌తో ప్రజలకు ఆరోగ్య భద్రత
- కడపకే తలమానికంగా మారిన సర్కిళ్లు
- కొత్తకొత్త భవనాలతో అభివృద్ధి బాట
- జిల్లాలో ముగిసిన సీఎం వైఎస్ జగన్ మూడు రోజుల పర్యటన

● పురిటిగడ్డపై మమకారం..

పురోగతికి సహకారం



పులివెందుల సీఎస్ఐ చర్చిలో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



తల్లి విజయమ్మకు కేక్ తినిపిస్తున్న సీఎం

సాక్షి, కడప: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తున్నారు. వైఎస్సార్ జిల్లాలో తన మూడు రోజుల పర్యటనలో అదే పంథాను కొనసాగించారు. పుట్టిన గడ్డపై మమకారంతో అభివృద్ధికి సహకారం అందిస్తున్నారు. ఒకవైపు అభివృద్ధికి బాటలు వేస్తూనే మరోవైపు యువత ఉపాధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే కొప్పర్తి పారిశ్రామికవాడలో కావాల్సినన్ని పరిశ్రమలు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బద్వేలు ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి లభించేలా సెంచురీ ప్యానల్స్ పరిశ్రమను ప్రారంభించారు. ఆరోగ్యానికి సంబంధించి కూడా ప్రజలకు భరోసానిస్తూ కడపలోని రిమ్స్‌ను సూపర్ స్పెషాలిటీగా మార్చి ప్రజలకు సేవలు అందించేలా చర్యలు తీసుకోవడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

యువతకు ఉపాధి
తొలిరోజు బద్వేలు నియోజకవర్గ కేంద్రానికి సమీపంలోని గోపవరం మండల పరిధిలో ఏర్పాటైన సెంచురీ ప్యానల్స్ లిమిటెడ్ పరిశ్రమ ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక పథక రచన చేసి ప్రారంభించారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో రూ. 960 కోట్ల పెట్టుబడితో పరిశ్రమను స్థాపించారు. నిరుద్యోగ యువత 2270 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రైతులు, యువతకు ఉపాధి మార్గంగా పరిశ్రమ ఉపయోగపడనుంది. అదేరోజు కడప లో ఆధునీకరించిన కలెక్టరేట్‌ను ప్రారంభించారు. కడప నగరానికే తలమానికంగా కనిపిస్తున్న ప్రధాన సర్కిళ్లయిన అంబేడ్కర్, కోటిరెడ్డి, ఏడురోడ్ల సర్కిళ్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి వినియోగంలోకి తెచ్చారు.

అభివృద్ధిలో ఆదర్శం
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నారు. రెండోరోజు పులివెందులలో అభివృద్ధికి సంబంధించి ఇడుపులపాయ వేదికగా సమీక్ష నిర్వహించారు. తర్వాత సింహాద్రిపురం మండల కేంద్రంలో వైఎస్సార్ పార్కు, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు, పోలీసుస్టేషన్, వివిధ సర్కిళ్లను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అంతేకాకుండా నాయకులు, కార్యకర్తలను కూడా బద్వేలు, ఇడుపులపాయ, పులివెందుల, కడప తదితర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ కలుసుకుని వారిలో కొత్త ఉత్సాహాన్నినింపారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు
మూడోరోజు పులివెందులలోని సీఎస్ఐ చర్చిలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కట్ చేసి కుటుంబ సభ్యులతో పాటు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పులివెందులలో వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లచెరువుపల్లి రవి స్వగృహానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. మైదుకూరులో వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు మదీనా దస్తగిరి కుమారుడు, కుమార్తెల వివాహాలకు వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు.

▸▸పర్యటన విజయవంతం
సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల పర్యటన వియవంతంగా ముగిసింది. ఈనెల 23న జిల్లా పర్యటన ప్రారంభమై 25వ తేదీ మధ్యాహ్నంతో ముగిసింది. సీఎం ఈ పర్యటనలో అనేక అభివృద్ధి పనులతోపాటు పరిశ్రమను ప్రారంభించారు. పర్యటన విజయ వంతంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంది.

▸▸సీఎంకు ఘన వీడ్కోలు
కడప కార్పొరేషన్: జిల్లాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ముగిసింది. సోమవారం పులివెందుల నుంచి హెలికాప్టర్‌లో 1.35 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకొన్న ముఖ్యమంత్రి, 1.45 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా ప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, ఎమ్మెల్సీలు పి. రామసుబ్బారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, రమేష్‌యాదవ్, ఎమ్మెల్యేలు పి. రవీంద్రనాథ్ రెడ్డి, దాసరి సుధ, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్, రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ మండలి ప్రధాన సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, హార్టికల్చర్ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.



ప్రార్థనలో పాల్గొన్న పార్టీ ముఖ్యనేతలు



చిన్నారి,వైఎస్ విజయమ్మతో కలిసి కేక్ కట్ చేస్తున్న సీఎం



ప్రార్థనకు హాజరైన సీఎం సతీమణి వైఎస్ భారతిరెడ్డి



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం



పులివెందుల సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు

న్యూస్‌రీల్

నేడు సమావేశం
కడప ఎడ్యుకేషన్: కడప టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని 26వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు పబ్బాపురం ప్లాట్స్ లో జరగనుంది. ఈ విషయాన్ని టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, బాలశౌరిరెడ్డిలు తెలిపారు. ప్రతి సభ్యుడు సమావేశానికి తప్పక హాజరు కావాలని వారు కోరారు.

నేడు పీఆర్‌టీయూ..
కడప ఎడ్యుకేషన్: ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయూ ఏపీ) రాష్ట్ర కౌన్సిల్ సమావేశం 26వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటలకు విజయవాడలోని కేఎల్‌రావ్ భవన్‌లో జరగనుంది. ఈ విషయాన్ని సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏబీ రామకృష్ణమరాజు తెలిపారు. జిల్లాలోని పీఆర్‌టీయూ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమావేశానికి హాజరుకావాలని తెలిపారు. సీపీఎస్, పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు, ఈహెచ్‌ఎస్ తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు.

వైభవంగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి సోమవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయంలో మూల విరాట్‌లకు ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి, కృష్ణస్వామి, చంద్రశేఖర్ స్వామి, వేద పండితులు రాచరాయ యోగీ స్వామి అభిషేకాలు జరిపారు. అనంతరం పట్టు వస్త్రాలు, పుష్పాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. పల్లకీలో కొలువుదీర్చారు.ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథ రామిరెడ్డి,భక్తులు పాల్గొన్నారు.

ఆట ఆరంభం

ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' (ఇది అందరి ఆట) మెగా టోర్నమెంట్‌కు రంగం సిద్ధమైంది. గ్రామ/వార్డు సచివాలయాలు మొదలు రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ వరకు ఆటగాళ్ల సత్తా చాటేందుకు సన్నద్ధం కాగా.. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. వైఎస్‌ఆర్ జిల్లా వ్యాప్తంగా 645 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో, అన్నమయ్య జిల్లాలో 501 గ్రామ/వార్డు సచివాలయాల్లో నేటి నుంచి క్రీడాసంబరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కథనం.

- నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర' మెగా క్రీడాటోర్నమెంట్
- వైఎస్‌ఆర్ జిల్లాలో 2,24,156 మంది క్రీడాకారులు
- అన్నమయ్య జిల్లాలో 1,90,167 మంది ఆటగాళ్లు..



ఖోఖో పోటీలో క్రీడాకారిణులు (ఫైల్)

▸▸లక్షల్లో రిజిస్ట్రేషన్‌లు..
ఐదు క్రీడాంశాల్లో నిర్వహించే ఈ మెగా టోర్నమెంట్‌కు వైఎస్‌ఆర్ జిల్లాలో 2,24,156 మంది, అన్నమయ్య జిల్లాలో 1,90,167 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వైఎస్‌ఆర్ జిల్లాలో 351, అన్నమయ్య జిల్లాలో 361 క్రీడామైదానాల్లో పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీల నిర్వహణకు ఇప్పటికే జిల్లా క్రీడాప్రాధికార సంస్థకు చెందిన శిక్షకులు గ్రామ/వార్డు సచివాలయ వలంటీర్లకు స్కోర్ నమోదు కోసం శిక్షణ పూర్తిచేశారు. పోటీల నిర్వహణ సజావుగా, సాఫీగా సాగేందుకు జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు.

▸▸మ్యాచ్‌ల షెడ్యూలు..

సచివాలయస్థాయిలో	:	26-12 నుంచి 09-01-24
మండలస్థాయి	:	19-01-24 నుంచి 23-01-24
నియోజకవర్గస్థాయి	:	24-01-24 నుంచి 30-01-24
జిల్లాస్థాయి	:	31-01-24 నుంచి 05-02-24
రాష్ట్రస్థాయి	:	06-02-24 నుంచి 10-02-24



కడప స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర'మెగా టోర్నమెంట్ నిర్వహణకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. వైఎస్సార్ జిల్లాలో 645 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో, అన్నమయ్య జిల్లాలో 501 గ్రామ/వార్డుసచివాలయాల పరిధిలో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడాపోటీలను నిర్వహించనున్నారు. కాగా ఇప్పటికే అన్ని మండల,వార్డు సచివాలయాలకు క్రీడాసామగ్రిని సైతం పంపిణీ చేసిన విషయం తెలిసిందే. దీంతో పాటు పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు 'ఆడుదాం ఆంధ్ర'లోగోతో కూడిన క్రీడాదుస్తులను అందజేశారు. దీంతో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లాలో టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో కడపలో జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు, అన్నమయ్య జిల్లాలో కలెక్టర్ పి.ఎస్. గిరీషా, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పోటీలు ప్రారంభం కానున్నాయి. గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో విజేతలకు మండలస్థాయిలోను, తర్వాత నియోజకవర్గ స్థాయి, జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. 45 రోజుల పాటు నిర్వహించే ఈ మెగా టోర్నమెంట్ నిర్వహణతో పల్లెలు, పట్టణాలు, నగరాల్లో క్రీడాసందడి నెలకొననుంది.

ఏర్పాట్లు పూర్తి..



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర'మెగా టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శాప్ ఆధ్వర్యంలో పోటీల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తున్నాం. వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకుల సేవలను వినియోగించుకుంటున్నాం. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి టోర్నమెంట్ నిర్వహించనున్నాం. - కె. జగన్నాథరెడ్డి, డీఎస్‌డీఓ, వైఎస్‌ఆర్ కడప జిల్లా

విజయవంతం చేయాలి..



'ఆడుదాం ఆంధ్ర'మెగా టోర్నమెంట్‌లో ఐదు రకాల క్రీడాంశాల్లో పోటీలను ఈనెల 26న ప్రారంభించనున్నాం. టోర్నమెంట్‌ను సజావుగా నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టాం. ఇప్పటికే క్రీడాసామగ్రిని సచివాలయస్థాయికి చేర్చాం. క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ.. పోటీలను విజయవంతం చేయాలి. - ఎస్. గౌస్‌బాషా, డీఎస్‌డీఓ, అన్నమయ్య జిల్లా

బాలోత్సవం జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఓబుల్‌రెడ్డి, లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్: కడపలో జనవరి 5, 6 తేదీల్లో నిర్వహించనున్న బాలోత్సవం పిల్లల పండుగను జయప్రదం చేయాలని బాలోత్సవ కమిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి, కార్యదర్శి లక్ష్మిరాజా పేర్కొన్నారు. సోమవారం కడపలోని శ్రీ హాస్పిటల్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ జనవరి 5,6 తేదీల్లో బాయ్స్ హైస్కూల్ మరియాపురంలో 28 అకడమిక్ విభాగాలు, 14 సాంస్కృతిక విభాగాల్లో పిల్లల పండుగ జరుగుతాయన్నారు. ఈ పోటీలలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపాలిటీ, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనటానికి అవకాశం ఉందన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకను వెలికి తీయడానికి 42 రకాల యాక్టివిటీస్‌లో పాల్గొనడానికి అవకాశం కల్పించామన్నారు. ఈ పోటీలలో పాల్గొనదలుచుకున్న పాఠశాల విద్యార్థులు డిసెంబర్ 31వ తేదీ నాటికి అప్లికేషన్ నమోదు చేసుకోవాలన్నారు. పోటీలు మూడు విభాగాలలో ఉంటాయన్నారు. మొదటి విభాగం సబ్ జూనియర్స్ రెండు, మూడు, నాలుగు తరగతులు, రెండో విభాగం జూనియర్స్ ఐదు, ఆరు, ఏడు తరగతులు, మూడో విభాగం సీనియర్స్ 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం ఉందన్నారు. అప్లికేషన్స్ పంపాల్సి చిరునామా కడప బాలోత్సవం కేర్ ఆఫ్ విద్యానికేతన్ పాఠశాల 63/123-1 అక్కాయపల్లె, రవీంద్రనగర్- 516003. మరిన్ని వివరాలకు ఈ మెయిల్ kadapabaalotsavam @gmail.com, 8121939351, 9182796052 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

★ క్రిస్మస్ సంబరం



కడప సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు (ఇన్‌సెట్) క్రిస్మస్ సందేశాన్ని ఇస్తున్న మత్తయ్యబాబు

లోక రక్షకుడైన ఏసుక్రీస్తు పాపులను పరిశుద్ధులను చేసేందుకు అరుదించిన పవిత్ర క్రిస్మస్ పర్వదినాన్ని సోమవారం జిల్లా అంతటా క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే సమీపంలోని చర్చిలకు వెళ్లి గురువులు అందించిన దైవ సందేశాన్ని విని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పులివెందుల, జమ్మల మడుగు, కడప, ప్రొద్దుటూరు,కలసపాడు, బద్వేలు, కమలాపురం, మైదుకూరు తదితర పెద్ద చర్చిలతోపాటు మండలాలు, గ్రామాల్లోని అన్ని చర్చిలలో క్రిస్మస్ ప్రార్థనలను నిర్వహించారు. ఆయా సంఘ కాపరులు, పాస్టర్లు, మత గురువులు, సిస్టర్లు, మదర్లు ప్రార్థనల్లో పాల్గొన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు కూడా ప్రార్థనల్లో పాల్గొని విశ్వాసులకు శుభాకాంక్షలు తెలియజేశారు. -కడప కల్చరల్

క్లుప్తంగా

వ్యక్తిపై దాడి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక గాంధీరోడ్డులో మహమ్మద్ సైఫ్ అనే వ్యక్తిపై కొందరు దాడి చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు ఆర్ట్స్‌కాలేజి రోడ్డుకు చెందిన సయ్యద్ మహమ్మద్ సైఫ్ ఎలక్ట్రికల్ పనికి వెళ్లేవాడు. ఈ క్రమంలో అతను సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బైక్‌లో గాంధీరోడ్డుకు వెళ్లాడు. అక్కడ స్నేహితుడు కనిపించడంతో అతనితో మాట్లాడుతూ నిల్చున్నాడు. కొద్ది సేపటి తర్వాత అవతార్ గౌస్, కరెంట్ బాషాలతో కొందరు వ్యక్తులు అక్కడికి వచ్చి అతనిపై దాడి చేశారు. తలకు, ఒంటిపై రక్తగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అతన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య



కానిస్టేబుల్ నాయబ్ రసూల్ మృతదేహం

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని అలంఖాన్‌పల్లిలో నివసిస్తూ, కడప ఎయిర్‌పోర్ట్‌లో ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పొలిచెర్ల నాయబ్ రసూల్ (33) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య షేక్ నసీమా ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కనిగిరి టౌన్‌కు చెందిన పొలిచెర్ల నాయబ్ రసూల్ 2013 బ్యాచ్‌లో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాడు. అతను కడప విమానాశ్రయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం ప్రకాశం జిల్లాకే చెందిన షేక్ నసీమాను వివాహం చేసుకున్నాడు. వీరు అలంఖాన్‌పల్లిలో నివాసం ఉంటున్నారు. ఇటీవల కొన్ని రోజుల క్రితం నాయబ్ రసూల్ భార్య షేక్ నసీమా తన పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో ఒంటరిగా ఉన్న కానిస్టేబుల్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వాళ్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కడప తాలూకా ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పిల్లలు కలగలేదనా లేక మరే ఇతర కారణాలతో ఈ చర్యకు పాల్పడ్డాడా అనేది తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

నన్ను తొలగించడానికి మీరెవరు?

కడప రూరల్ : గత కొన్నేళ్లుగా టీడీపీలో కష్టపడి పనిచేస్తున్న తనను తొలగించడానికి మీరెవరని టీడీపీ మైనార్టీ విభాగం కడప నగర అధ్యక్షుడు ఇమ్రాన్ ప్రశ్నించారు. సోమవారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడారు. 2005 నుంచి తాను టీడీపీ సభ్యత్వం కలిగి కడప నగరంలో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నానన్నారు. తన కష్టాన్ని గుర్తించి అమీర్‌బాబు 2019లో తనను మైనార్టీ విభాగం నగర అధ్యక్షునిగా నియమించారన్నారు. ఈ క్రమంలో తాను ఎలాంటి తప్పు చేయకపోయినా, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకపోయినా కనీసం షోకాజ్ నోటీసు జారీ చేయకుండా పదవి నుంచి తొలగించిస్తున్నట్లు టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవీరెడ్డి ప్రకటించడం దారుణమన్నారు. ఎమ్మెల్యే టిక్కెట్ కావాలని వస్తున్న మాధవీరెడ్డి గత కార్పొరేషన్ ఎన్నికలతోపాటు పార్టీ కష్టకాలంలో ఎక్కడ ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

కాలుష్య గ్రామాలకు మెరుగైన పునరావాసం

- రూ.40 కోట్లతో తొలివిడత మౌలిక సదుపాయాలు
- వేగంగా ప్లాట్‌లు, రోడ్డు, తాగునీటి సౌకర్యం
- దశాబ్దాల గ్రామస్తుల కల సాకారం



ముక్కావారిపల్లె రెవెన్యూ పరిధిలో మూడు గ్రామాల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో పునరావాసం కల్పిస్తున్న దృశ్యం



పునరావాస పనులు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల, కలెక్టర్ గిరీషా పీఎస్(ఫైల్)

ఓబులవారిపల్లె : మంగంపేటలోని కాపుపల్లె, దళితవాడ, అరుంధతివాడ గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా కాలుష్యం కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. తెలుగుదేశం పార్టీ పాలనలో కాలుష్య గ్రామాలను తరలించకపోవడంతో చాలా మంది గ్రామస్తులు అంతుచిక్కని రోగాలతో ప్రాణాలు కోల్పోయారు. గ్రామాల తరలింపునకు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పోరాటం చేశారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే కాలుష్య గ్రామాల తరలింపునకు దాదాపు 400 కోట్ల రూపాయలతో ప్రక్రియను ప్రారంభించారు. కోవిడ్ కారణంగా కొంత ఆలస్యం అయినా గ్రామాలను తరలించి పునరావాసం కల్పిచేందుకు చర్యలు తీసుకొన్నారు. ముక్కావారిపల్లె రెవెన్యూ పరిధిలో దాదాపు వంద ఎకరాలలో భూసేకరణ చేపట్టి దాదాపు రెండు కోట్ల రూపాయలతో చదును చేసి అభివృద్ధి చేశారు.

గ్రామస్తుల సహకారంతో పునరావాసం వేగవంతం

కాలుష్య గ్రామస్తుల సహకారంతో రెవెన్యూ, ఏపీఎండీసీ అధికారులు పునరావాస ప్రక్రియను వేగవంతం చేశారు. ఇంటి నంబర్‌లు కేటాయించడం దగ్గర నుంచి ప్యాకేజీలు, ఓటీఎస్‌పై పలుమార్లు జిలా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు గ్రామసభలు నిర్వహించారు. గ్రామస్తుల అంగీకారంతో పునరావాస కల్పన చేపట్టారు. దీంతో దాదాపు 650 కుటుంబాలకు పునరావాసం కల్పించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టారు. ఇప్పటికే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో ముక్కావారిపల్లె పంచాయతీలో ఏపీఎండీసీ భూసేకరణ ద్వారా దాదాపు వంద ఎకరాల స్థలంలో అభివృద్ధి పనులు చేయిస్తున్నారు.

తొలివిడత రూ.40 కోట్లతో మౌలిక సదుపాయాలు

గ్రామాల తరలింపు కోసం రోడ్లు, తాగునీటి పైపులైన్, ప్లాట్‌లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు తొలివిడత 40 కోట్ల రూపాయలతో పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కడప-చెన్నై జాతీయ రహదారి పక్కన ముక్కావారిపల్లె రెవెన్యూ పంచాయతీలో మూడు గ్రామాల కోసం దాదాపుగా 700 ప్లాట్‌లు ఏర్పాటు చేశారు. రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాగునీటి కోసం మూడు బోర్లు వేయగా పుష్కలంగా నీరు పడింది. అంతే కాకుండా ఉపరితల జలాశయం నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. నాణ్యతలో ఎక్కడా లోపాలు జరగకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకొంటున్నారు. గ్రామంలో దేవాలయాలు, పార్కు, పాఠశాల, క్రీడామైదానం ఏర్పాటు చేస్తున్నారు. మంగంపేట అరుంధతి వాడ గ్రామంలో దాదాపు 140 కుటుంబాలకు దాదాపు పదికోట్ల రూపాయల పరిహారం కూడ అందించారు. దశాబ్దాల కల సాకారం కావడం, పునరావాస ప్రక్రియ వేగవంతంగా జరుగుతుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చిన మాట నిలుపుకున్నారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక సందర్భంలో రైల్వేకోడూరు తనకు పులివెందుల తరువాత సొంత గ్రామం మంగంపేట అని అన్నారు. కాలుష్య గ్రామాలను తరలిస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం మూడు గ్రామాలను తరలించి పునరావాసం కల్పించారు. సీఎంతో పాటు మంత్రి ఎంపీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు.

– తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్, చిత్తూరు జిల్లా, కాపుపల్లె మంగంపేట, ఓబులవారిపల్లె మండలం

ఆహ్లాదకరమైన వాతావరణంలో పునరావాసం



విశాలమైన, ఆహ్లాదకరమైన, సువిశాలమైన ప్రదేశంలో అన్ని వసతులతో కూడిన మెరుగైన పునరావాసం కల్పిస్తున్నారు. ప్రస్తుతం ప్లాట్‌లు, నాణ్యమైన, విశాలమైన రోడ్లు, మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్నారు. గ్రామస్తుల అంగీకారం మేరకు పునరావాసం ప్యాకేజీలు ఏర్పాటు చేస్తున్నారు.

– కోటి, కాపుపల్లె దళితవాడ, మంగంపేట, ఓబులవారిపల్లె మండలం

పునరావాసంతో గ్రామస్తులకు ఊరట



గ్రామాలకు సమీపంలో మట్టిని తోలుతుండటంతో గతంలో కాలుష్యం కారణంగా ప్రతి నిత్యం ఇబ్బందులు పడుతూ వచ్చాము. అనేక మంది వ్యాధులతో మరణించారు. టీడీపీ హయాంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే గ్రామాలకు పునరావాసం ప్రక్రియను ప్రారంభించారు. దీంతో మూడు గ్రామాల ప్రజలకు ఎంతో ఊరట లభించింది.

– మినుగు సుధాకర్, సర్పంచ్ మంగంపేట, ఓబులవారిపల్లె మండలం.

నలభైకోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు



ప్రస్తుతం మంగంపేట కాపుపల్లె, దళితవాడ, అరుంధతివాడ గ్రామాల తరలింపునకు నలభైకోట్ల రూపాయలతో రోడ్లు, నీటి ట్యాంక్‌లు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల పనులు జరుగుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు జరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నాము.

– సుదర్శన్‌రెడ్డి, సీపీఓ,ఏపీఎండీసీ, మంగంపేట, ఓబులవారిపల్లె

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. జగనన్న సురక్ష ద్వారా పలు సర్టిఫికెట్లు సత్వరమే అందుతున్నాయి. నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి



ప్రభుత్వ పాఠశాలలు నాడు–నేడు ద్వారా కనీ విని ఎరుగని రీతిలో అన్ని విధాలుగా అభివృద్ధి చెందాయి. నూతన తరగతి గదుల నిర్మాణం, బెంచీలు, అధునాతన టాయిలెట్లు, ఫ్యాన్‌లు, పుష్టికరమైన మధ్యాహ్న భోజనం తదితర అన్ని సౌకర్యాలను కల్పించారు. లక్షల రూపాయల ఫీజు చెల్లించే కార్పొరేట్ స్కూల్స్‌లో కూడా లేని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డ్స్(ఐఎఫ్‌పీ ప్యానల్స్) ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోంది. విద్యార్థులకు అత్యాధునిక వసతుల ద్వారా జ్ఞానాన్ని అందించే విధంగా ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక చర్యలు ప్రశంసనీయం.

– సావిత్రమ్మ, మండల విద్యాశాఖాధికారి, ప్రొద్దుటూరు

సొంతింటి కల నెరవేరింది



మాది పేద కుటుంబం. నా భర్త, నేను కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాము. మాకు ఇల్లు లేక చిన్న రేకుల షెడ్డులో ఉంటున్నాము. గత ప్రభుత్వంలో ఇంటి కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మీకు జగనన్న పక్కా గృహంతో పాటు ఇల్లు కూడా మంజూరైందని మా వలంటీర్ తెలిపారు. మేము ఆ స్థలంలో ఇల్లు కట్టుకున్నాము. మా సొంతింటి కల నెరవేరింది. అంతేకాకుండా మా పిల్లలకు అమ్మఒడి పథకం ద్వారా నగదు జమ కావడంతో పిల్లలను మంచి చదువులు చదివిస్తున్నాము. మా కుటుంబానికి ఇంత లబ్ధిని చేకూర్చిన జగన్‌మోహన్ రెడ్డిని ఎప్పటికీ మరువలేము.

– బత్తులనాగలక్ష్మి, మామిళ్లపల్లె, కలసపాడు మండలం


ఇంటి వద్దకే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు



నేను డిగ్రీ ఫైనలియర్ పూర్తి చేసుకున్నాను. నాకు అవసరమయ్యే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జగనన్న సురక్ష ద్వారా సచివాలయంలోనే ఉచితంగా అందజేయనున్నట్లు మా వలంటీర్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న నాలుగు రోజుల వ్యవధిలోనే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నాను. జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ ద్వారా అన్ని పథకాలు ఇంటి వద్దకే వస్తున్నాయి. కుల, ఆదా య ధ్రువీకరణ పత్రాలు కూడా ఉచితంగా అందజేయడం చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– మిరియాల వీరభద్రుడు, కాలువపల్లె, గోపవరం మండలం

పర్యాటకం పరుగులు



హార్సిలీహిల్స్

- ఆదాయంలో మెరుగైన అభివృద్ధి
- హోటళ్లలో కడప, పర్యాటకంలో హార్సిలీహిల్స్ టాప్
- హార్సిలీహిల్స్ అభివృద్ధికి రూ.7 కోట్లతో ప్రతిపాదన

ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆదాయం	
ఏడాది	ఆదాయం
2019-20	రూ.8,47,56,127
2020-21	రూ.6,51,37,438
2021-22	రూ.11,82,76,369
2022-23	రూ.17,11,04,877
2023-24	రూ.10,85,32,623

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ఆదాయం (రూ.లక్షల్లో)	
ఏడాది	ఆదాయం
2019-20	415.38
2020-21	344.62
2021-22	432.55
2022-23	482.62
2023-24	304.48

బి.కొత్తకోట : ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో పర్యాటకశాఖ ఆదాయం పరుగులు పెడుతోంది. కోవిడ్ తర్వాత తగ్గిపోయిన ఆదాయాన్ని తిరిగి పెంచుకునేందుకు అధికారుల చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. దీనికి తోడు కొత్తగా కార్యక్రమాలను చేపట్టి ఆదాయం పెంచుకునే దిశగా ఉన్నతాధికారులు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. తాజాగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన హైదరాబాద్, విజయవాడ నుంచి పర్యాటకుల కోసం ఆలయాల ప్యాకేజీలను ప్రారంభిస్తున్నారు. ఈ ప్యాకేజీలతో ఆదాయం పెంచుకోవడమే కాకుండా పర్యాటకులకు ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌పైన టూరిజం అతిథిగృహాల ఆధునీకరణ, అభివృద్ధి కోసం బెంగళూరుకు చెందిన కన్సల్టెన్సీ సంస్థ రూ.7 కోట్లకు నివేదించగా దీనిని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీని మంజూరుకు ప్రభుత్వం పరిశీలన చేస్తోంది.

టూరిజం యూనిట్లలో కార్యకలాపాలు

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో హార్సిలీహిల్స్, కైలాసనాథకోన, పులిగుండు పర్యాటక ప్రాంతాలుగా టూరిజం యూనిట్ల కింద రిసార్ట్‌లు, హోటళ్ల నిర్వహణ జరుగుతోంది.ఇవికాక పలమనేరు, తిరుమల, శ్రీకాళహస్తీ, నగరి, కుప్పం, పుత్తూరుల్లో హోటళ్లు, రిసార్ట్, అతిథిగృహాల నిర్వహణ సాగుతోంది. హార్సిలీహిల్స్‌పై అతిథిగృహాలు, బార్, రెస్టారెంట్ నిర్వహణ సాగుతోంది. తిరుచానూరులో పద్మావతి నిలయంలో గదుల నిర్వహణ సాగుతుండగా ఇక్కడ తిరుపతి కలెక్టరేట్‌ను ఏర్పాటు చేశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో కడప, గండికోట, ఒంటిమిట్ట, ఇడుపులపాయ, గండిలో హోటళ్ల నిర్వహణ, అతిథిగృహాలు ఉన్నాయి. అలంఖాన్‌పల్లెలో టూరిజం బార్, దేవునికడప, పార్నపల్లిలో టూరిజం బోటింగ్ నిర్వహణ సాగుతున్నాయి.

హార్సిలీహిల్స్ ఆదాయం బాగు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యధిక ఆదాయం వస్తున్న బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఇప్పుడు అన్నమయ్య జిల్లాలోకి మారింది. ఇక్కడ 2019–20లో రూ.4.44 కోట్లు, 2020–21లో రూ.2.36 కోట్లు, 2021–22లో రూ.3.23 కోట్లు, 2022–23లో రూ.3.63 కోట్లు, 2023–24 నవంబర్ వరకు 2.16 కోట్ల ఆదాయం వచ్చింది. వైఎస్సార్ జిల్లాలో వస్తున్న టూరిజం ఆదాయంలో కడప నగరం హోటల్ ఆదాయం బాగుంది. ఇక్కడ ప్రస్తుత ఏడాదిలో ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు రూ.146.87 లక్షల ఆదాయం లభించింది. పర్యాటకశాఖ యూనిట్లలో కొన్నిచోట్ల స్థానిక పరిస్థితుల ఆధారంగా ఆదాయంపై ప్రభావం చూపిస్తోంది. మొత్తం మీద ఉమ్మడిజిల్లాల పరిధిలోని ఆదాయం పరిశీలిస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు.

ప్యాకేజీలతో ఆదాయం

హైదరాబాద్, విజయవాడ నుంచి ఆలయాల ప్యాకేజీలు అమలు చేస్తుండటంతో ఈ రెండు ఉమ్మడి జిల్లాల పరిధిలోని ఆలయాల సందర్శన కోసం ప్రజలు ప్యాకేజీలను వినియోగించుకోనున్నారు. దీంతో ఆయా యూనిట్ల పరిధిలోని ఆలయాల సందర్శన, గదుల బుకింగ్, రెస్టారెంట్ ద్వారా ఆదాయం పెంచుకొనున్నారు.

ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం



టూరిజం ఆదాయం పెంచడం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. పర్యాటకశాఖకు తిరుమలలో కొత్తగా మూడు హోటళ్లను కేటాయించారు. దీనిద్వారా ఆశించిన మేర ఆదాయం దక్కనుంది. అలిపిరి సమీపంలోని టూరిజం హోటల్‌ను టెండర్ ద్వారా ప్రయివేటుకు అప్పగించి అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. దీంతో భవిష్యత్తులో పర్యాటక ఆదాయం మరింత పెరుగుతుంది.

–మడితాటి గిరిధర్‌రెడ్డి, డీవీఎం, ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ జిల్లా

రాష్ట్రస్థాయి తాళ భజన పోటీల్లో అనంతపురం ఫస్ట్



తాళ భజన పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.40 వేలను అందిస్తున్న బలరామిరెడ్డి

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో హనుమద్ వ్రత మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి నిర్వహించిన రాష్ట్రస్థాయి తాళ భజన పోటీల్లో అనంతపురం జిల్లా యల్లనూరు మండలం కూచివారిపల్లె సీతారామ భజన సంఘం మొదటి స్థానంలో నిలిచింది. వారికి పాతకోట ఆనంద్ రెడ్డి రూ.40 వేలను అందించారు.

ఈ పోటీలు ఆలయ చైర్మన్ విజయలక్ష్మి, ఈఓ బీవీ నరసయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం వరకు జరిగాయి. అలాగే రెండవ స్థానంలో అనంతపురం జిల్లా మరూరు చిన్న కదరయ్య బృందం, ఎర్రగుంట్ల మండలంలోని ఆర్టీపీపీ అభయాంజనేయ బృందానికి మార్కులు సమానంగా రావడంతో చెరో రూ.25 వేలను గాదెగూడూరు వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలా వెంకటరెడ్డి, వెల్లాల సుదర్శన్ రెడ్డిలు అందజేశారు. నాలుగో స్థానంలో నంద్యాల జిల్లా బేతంచర్ల మండలంలోని శంకరాపురం వెంకటేశ్వర బృందానికి జీరెడ్డి సుదర్శన్ రెడ్డి రూ.15 వేలు అందజేశారు. అలాగే ఐదో స్థానంలో నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మూలె పెద్దమ్మ బృందం, ఆరో స్థానంలో వీ.లక్ష్ముంపల్లె చౌడేశ్వరి బృందం, ఏడో స్థానంలో నార్పల మండలం వెంకటాంపల్లె శ్రీరామ బృందం, ఎనిమిదో స్థానంలో ఖాజీపేట మండలం సుంకేసుల కనకదుర్గ బృందం, తొమ్మిదో స్థానంలో పల్టిపురం మల్లికార్జున బృందం, పదో స్థానంలో రాజుపాళెం మండలం అర్కటవేముల అశ్వర్థ నారాయణ స్వామి బృందం, పదకొండో స్థానంలో నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం పెట్నికోట రామాంజనేయ బృందం, పన్నెండో స్థానంలో పుల్లదుమ్మి నీలకంఠేశ్వర బృందం, పదమూడో స్థానంలో తెలంగాణ రాష్ట్రంలోని రాయిని పల్లె దైవాజ్ఞ బృందం, పద్నాలుగో స్థానంలో పెద్దముడియం మండలం తిరుపాల్‌దిన్నె శ్రీరామ బృందం, 15వ స్థానంలో అనంతపురం జిల్లా పామిడి దత్తాత్రేయ బృందం నిలిచాయి. అలాగే ఉత్తమ గాయని, గాయకుడు, హార్మోనిస్ట్, తబలిస్ట్, కోరస్‌లకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున అందజేశారు. ఇందులో మొత్తం 45 భజన సంఘాలు పాల్గొనగా, న్యాయ నిర్ణేతలుగా కర్నూలు జిల్లాకు చెందిన తిరుపాల్, తెలంగాణ రాష్ట్రం గద్వాల్‌కు చెందిన సత్తెన్న, వ్యాఖ్యాతగా తాడిపత్రి శ్రీనివాసుల రెడ్డి వ్యవహరించారు. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక ఇతర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేయాలి

పద్మశాలీ ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు



మాట్లాడుతున్న పద్మశాలీ ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్ : పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ కోసం సంఘం కృషి చేస్తోందని పద్మశాలీయ ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం కడప మద్రాసురోడ్డు చిన్నచౌక్ పద్మశాలిభవన్‌లో పద్మశాలీ ఉద్యోగ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ సమాజంలో సేవలు అందిస్తూ సంఘం సంక్షేమ కోసం కృషి చేయాలన్నారు. సంఘ గౌరవాధ్యక్షుడు, ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ గానుల రవీంద్రనాథ్ మాట్లాడుతూ సంఘం ప్రతి ఉద్యోగికి వృత్తి రీత్యా ఎదురయ్యే సమస్యలలో తోడుగా ఉంటుందన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోము జ్ఞానశంకర్ పెన్షనర్లకు సంబంధించిన పలు అనుమానాలను నివృత్తి చేశారు. సెక్రటరీ చుప్పల విజయ్‌కుమార్, మానవత సేవాసమితి నాయకులు రాటాల గోపీ, అవ్వారు రమేష్ మాట్లాడారు. అనంతరం పద్మశాలీ సేవాభవన్ అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు, రిటైర్డు లెక్చరర్ మామిళ్ల వెంకటసుబ్బయ్యల చేతుల మీదుగా 2024 నూతన సంవత్సర వార్షిక క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బీవీ క్రిష్ణయ్య, ఉపాధ్యక్షుడు వద్ది మాధవ, సంయుక్త కార్యదర్శి లోకేష్, వద్ది చైతన్య, ఏపీటీఎఫ్ నాయకులు సీవీ ప్రసాద్, మామిళ్ల సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామసముద్రం బోయవీధికి చెందిన రవి భార్య హారిక(32) ఆశా కార్యకర్తగా పనిచేస్తోంది. గత కొంతకాలంగా ఆమె కడుపునొప్పితో బాధపడుతుండగా, సోమవారం మరోసారి నొప్పి అధికమవడంతో భరించలేక నిద్రమాత్రలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీ బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన రమణప్ప కుమారుడు వెంకటరమణ(38) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. అతడి భార్య అనారోగ్యంతో పుట్టింట్లోనే ఉంటోంది. ఆమెను తనవద్దకు పంపలేదన్న మనస్తాపంతో సోమవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.